సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



కోపం ఉంటే నాపై చూపండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవికి ఏదైనా కోపం, కక్ష ఉంటే తనపై చూపించాలని, ప్రజలపై చూపవద్దని దేవిరెడ్డి ఆదిత్య అన్నారు. -8లో



స్టెమి ప్రాజెక్టుతో గుండెకు భరోసా

హార్ట్ ఎటాక్ కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం ఆలస్యం చేసినా పేషెంట్ ప్రాణాలకే ప్రమాదమని కార్డియాలజిస్టు హెచ్చరిస్తున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.6/18.4

వాతావరణం

జిల్లాలో శనివారం 18.4–36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబు



వీరభద్రస్వామి ఆలయ గోపురాన్ని శుభ్రం చేస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

రాయచోటి టౌన్: శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారులు, ఫైర్ ఇంజిన్‌తో ఆలయ ప్రధాన గోపురాలను శుభ్రం చేశారు. ఆలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

18న రామాయణంపై సదస్సు

కడప కల్చరల్: తెలుగులో వచ్చిన రామాయణాలపై కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రెండు రోజులపాటు అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం, సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సహకారంతో ఫిబ్రవరి 18, 19 తేదీల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. తెలుగులో రామాయణాలు–సామాజిక దృక్పథం అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందని తెలిపారు. వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. బ్రౌన్ కేంద్రం డైరెక్టర్ ఆచార్య జి.పార్వతి సమన్వయకర్తగా, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ అధ్యక్షులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రామాయణంపై దాదాపు 100 మంది ప్రతినిధులు దేశ విదేశాల నుంచి వచ్చి పాల్గొంటారన్నారు. అలాగే పలువురు విదేశీ పరిశోధకులు పత్ర సమర్పణలు చేస్తారని వివరించారు.

రాజీ యత్నాలు విఫలం!

- జిల్లా నేతల పంచాయితీకి తలొగ్గని ఎమ్మెల్యే
- హైదరాబాద్ కేంద్రంగా ఓ ప్రధాన కాంట్రాక్టర్ మంతనాలు
- ఎమ్మెల్యే డిమాండ్లు అంగీకరించని పార్లమెంటు సభ్యుడు



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



ఎంపీ రమేష్‌నాయుడు



సాక్షి ప్రతినిధి, కడప: ఒకరు ఎమ్మెల్యే.. మరొకరు పార్లమెంటు సభ్యులు.. ఇద్దరు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులు. నియోజకవర్గంలో పెత్తనం నాదే.. పనులు నావే...అంటూ ఒకరంటే, దేశ వ్యాప్తంగా కాంట్రాక్టు పనులు చేస్తున్నాం. సొంత జిల్లాలో.. అదీ సొంత నియోజకవర్గంలో కాంట్రాక్టు పనులు చేయలేమా!' అంటూ మరొకరు మాటలు పెంచారు. 'సత్తా ఏమిటో చూపిస్తాం కాసుకో...' అంటూ ఇంకొకరు ఏకంగా క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష దౌర్జన్యానికి దిగారు. ఇరువురు మధ్య మాటల యుద్ధం, క్షేత్రస్థాయిలో దాడులు.. ఆ ఇద్దరి నేతల మధ్య కొన్ని రోజులుగా జరుగుతున్న అంతర్యుద్ధం ఇది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన కొందరు నేతలు చేసిన రాజీ ప్రయత్నాలు విఫలమయ్యాయి. తాజాగా ఈ వ్యవహారం హైదారాబాద్‌కు చేరింది. ఓ ప్రముఖ కాంట్రాక్టర్ ఆ నేతల మధ్య రాజీ ప్రయత్నాలు ఆరంభించారు. అక్కడా సయోధ్య కుదరక వ్యవహారం మళ్లీ మొదటికే వచ్చింది. హైలెవెల్ ఫిర్యాదు అనంతరం పనులు చేసేందుకు సదరు నేత కాంట్రాక్టు సంస్థ ముందడుగు వేస్తోంది. అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు పోలీసుశాఖకు దిశా నిర్దేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

- గండికోట ప్రాజెక్టు ఆధారంగా వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు లభించాయి. కొండాపురం మండలంలోని దొబ్బుడుపల్లె, రావికుంట, తిరువాలయపల్లె గ్రామాలతోపాటు మైలవరం మండలంలోని బొగ్గుల పల్లె పరిధిలో 250 ఎకరాలు ప్రభుత్వ భూమి, 150 ఎకరాలు ఫారెస్టు భూమిలో ఏర్పాటు చేయనున్నారు. తొలివిడతగా రూ.1800కోట్లుతో నిర్మాణ పనులకు ఆసంస్థ శ్రీకారం చుట్టింది. అనకాపల్లి ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు సివిల్ పనులు దక్కాయి. క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టారు. ఈపనులను తామే చేయాలంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పట్టుబట్టారు. ఇదివరకు పలుమార్లు నిర్మాణ పనులు తమ వర్గీయులకే అప్పగించాల్సిందిగా కోరినట్లు సమాచారం. ఆశించిన స్పందన లేకపోవడంతో గతేడాది నవంబర్ 19న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సోదరుడు శివనారాయణరెడ్డి, మరో సోదరుడి కుమారుడు రాజేష్‌రెడ్డి సారధ్యంలో అనుచరులు వెళ్లి దొబ్బుడుపల్లె వద్ద చేపడుతున్న నిర్మాణపనుల్లో విధ్వంసం సృష్టించారు. రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బందిపై దాడి చేసి, అక్కడే ఉన్న వాహనాలను పగలగొట్టారు. పొట్లదుర్తి నుంచి వచ్చి ఇక్కడ పనులు చేస్తుంటే చూస్తూ కూర్చొండిపోవాలంటూ అప్పట్లో తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు.

పోలీసుశాఖకు దిశా-నిర్దేశం

ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఆటంకాలు కల్గిస్తే చర్యలు చేపట్టాలని ఎంతటి వారైనా సరే ఉపేక్షించరాదంటూ సీఎంఓ నుంచి పోలీసుశాఖకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఇదివరకూ రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి సీఎం రాజేష్‌నాయుడు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొరపెట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఎంపీ రమేష్‌నాయుడు సైతం హైలెవెల్ ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా కేంద్రానికి మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఈనేపథ్యంలో రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సివిల్ పనులు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు సైతం అలెర్ట్‌గా ఉండాలంటూ ఏ సమయంలోనైనా సూచించిన ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలంటూ పోలీసు బాస్ దిశా నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే దుశ్చర్యలను కట్టడి చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం.

జిల్లా నేతల మంతనాలు విఫలం...

రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్ ఇంజనీర్లపై ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు దాడి ఘటన నేపథ్యంలో జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్సీ రంగ ప్రవేశం చేసి ఇరువురు మధ్య పంచాయితీ చేసేందుకు తలదూర్చారు. మధ్యస్థంగా పర్సేంటేజీతో నిమిత్తం లేకుండా గుంపగుత్తగా కొంత మొత్తం అప్పగిస్తారంటూ ఒప్పించే యత్నం చేశారు. ఇరు పక్షాలు అంగీకరించినట్లే ఉన్నా అంతలోనే వ్యవహారం చెడిపోయినట్లు సమాచారం. వెరసి జిల్లా నేతల మంతనాలు విఫలమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రమేష్‌నాయుడు పార్లమెంటు సభ్యుడు హోదాలో జమ్మలమడుగు కేంద్రంగా దేవగుడి గ్రామస్తుడు ఆధ్వర్యంలో జరుగుతున్న పేకాట జూదాన్ని కట్టడి చేయాలంటూ స్వయానా కలెక్టర్, ఎస్పీలకు లేఖ రాశారు. ఆ వెంటనే అక్రమ ఇసుక తరలింపు వ్యవహారంపై మరో లేఖ రాసేందుకు సన్నహాలు చేపట్టగా పంచాయితీలో తలదూర్చిన మాజీ ఎమ్మెల్సీ తాము సైతం ఇసుకపై ఆధారపడి ఆదాయం గడిస్తున్నామని, అందర్నీ ఇబ్బంది పెట్టొద్దంటూ మొరపెట్టుకున్నట్లు తెలిసింది. కాగా అటు ఎమ్మెల్యే, ఇటు ఎంపీ కాంట్రాక్టు పనుల వ్యవహారం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న మరో బడా కాంట్రాక్టర్ మధ్యస్థం చేసేందుకు తలదూర్చినట్లు సమాచారం. అక్కడ కూడా ఆశించిన స్థాయిలో చర్చలు సఫలం కాకపోవడంతో హైలెవెల్ ఫిర్యాదుకు ఎంపీ సీఎం రమేష్ నాయుడు మొగ్గు చూపినట్లు సమాచారం.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్



పంచలింగాల వద్ద వివిధశాఖల అధికారులతో మాట్లాడుతున్న కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్

సిద్దవటం: మహా శివరాత్రి ఉత్సవాల్లో శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కడప ఆర్డీఓ జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు.సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలో వెలసిన నిత్యపూజ స్వామి మహా శివరాత్రి ఉత్సవాలపై శనివారం పంచలింగాల వద్ద అధికారులతో ఆర్డీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచలింగాల వద్ద, కాలినడక మార్గంలో, ఆలయం వద్ద మొత్తం మూడు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. శానిటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నలిపేలా చూడాలని తెలిపారు. భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని దేవదాయశాఖ అధికారులకు సూచించామన్నారు. 108, 104 వాహనాలను పంచలింగాల వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఒంటిమిట్ట సీఐ బాబు మాట్లాడుతూ 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.పంచలింగాల వద్ద, ఆలయం ఆవరణలో రెండు వైర్‌లెస్ సెట్లను అమరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, ఆర్డీ ఏఓ శంకర్‌రావు, రేంజర్ కళావతి, వీఆర్‌వో ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, సర్పంచ్ ప్రతినిధి లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల పనితీరు మెరుగుపడాలి

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపరుచుకుని అర్జీలను బాధ్యతాయుతంగా, జవాబుదారి తనంతో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో జమ్మలమడుగు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వోలు, మండల సర్వేయర్లతో నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలని చెప్పారు. గ్రీవెన్స్‌సెల్ అర్జీలను ఆయా గ్రామాల వారీగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష నిర్వహిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు. భూముల అంశంలో పారదర్శక విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ విచారణలు నిర్వహించే సందర్భంలో సర్వేయర్లు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి ప్రతి మండల స్థాయి అధికారులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్, పట్టాదారు పాసుపుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీఓలు చిన్నయ్య, సాయిశ్రీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ ముఖ్యం

- వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ శనివారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిరంతరం వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు సీనియర్ పోలీస్ అధికారులు, ఆయా రంగాల్లో లబ్ధప్రతిష్టులైన ఫ్యాకల్టీతో ఇస్తున్న ట్రైనింగ్ క్లాసెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా, ఓపికగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలోని కంప్యూటర్ ల్యాబ్, ప్రిన్సిపల్ కార్యాలయం, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్, బ్యారక్‌లను పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్‌రెడ్డిలకు సూచించారు. అనంతరం ఎస్పీ ఎర్ర చందనం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివరాముడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్: పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో స్వామివారికి అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, ఈఓ రమణ పర్యవేక్షించారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీరంగనాథస్వామి పట్టణ పురవీధులలో ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



గరుడ వాహనంపై సతీసమేత శ్రీరంగనాథుడు

పర్యాటక అభివృద్ధికి

గండి కొడతారా.. కోట కడతారా!

- సీఎం నోట 'గండికోటకు బ్రాండింగ్ స్టేటస్'
- గతంలో చెప్పిన వాటికే మోక్షం లేదని పర్యాటకాభిమానుల నిట్టూర్పు
- ప్రణాళికల పేరుతో కాలయాపన చేయొద్దని విన్నపం



గండికోట పెన్నా లోయ



గండికోటలో ట్రెక్కింగ్ సందడి

కడప కల్చరల్: కూటమి ప్రభుత్వం జిల్లా పర్యాటకాభివృద్ధికి పథకాల ఊరింపుతోనే సరి పెడుతోంది. ప్రణాళికల పేరిట గడువు పెడుతూ కాలయాపన చేస్తోంది. జిల్లా పర్యాటకంపై ప్రత్యేకమైన ప్రేమ కురిపిస్తున్నట్లు నటిస్తూ.. అమల్లోకి వచ్చేసరికి రిక్తహస్తం చూపిస్తోంది. తాజాగా గురువారం సంబంధిత మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా జిల్లాలతో పాటు వైఎస్సార్ జిల్లా పర్యాటకానికి కూడా పలు వరాలు కురిపించారు. ప్రధానంగా గండికోటపై దృష్టి సారించారు. దేశంలోనే ఇలాంటి ప్రాంతం లేదని, ఈ అద్భుతమైన ప్రాంతం వన, జల, గిరిదుర్గంగా ప్రాధాన్యత సంతరించుకుందని ప్రశంసించారు. గండికోటను బ్రాండింగ్ చేయాలని, టెంట్ సిటీగా ప్రకటించాలని కూడా సూచించారు. సాస్ కీ పథకంలో భాగంగా గండికోటను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిశ్చయంతో ఉందని వెల్లడించారు. ఇప్పటికే గండికోటను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. జిల్లాలోని పెద్దదర్గా, గండికోట, ఒంటిమిట్ట, సోమశిల ప్రాంతాలను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికల్లో చోటు కల్పించారు. ఇంకా జిల్లాకు సంబంధించి పర్యాటకంగా పలు పథకాలు సూచించారు. పథకాల ఊరింపు బాగానే ఉంది.. వీటి అమలు ఎప్పుడని పర్యాటకాభిమానులు ప్రశ్నిస్తున్నారు. కోటలు దాటే మీ మాటల్ని కట్టిపెట్టి... ఈసారైనా వాటిని అమలు చేయండి బాబూ.. అంటూ విన్నవిస్తున్నారు.

అభివృద్ధి ఎలా?

పర్యాటకరంగంలో ఆతిథ్యరంగం విశేషమైన ప్రాధాన్యత కలిగి ఉందని, వీటిని పర్యాటకులకు స్వర్గధామంగా మలిచి ఈ సంవత్సరం 20 శాతం అభివృద్ధి రేటు సాధించాలని సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. కానీ ఆయన హయాంలో ఇంతవరకు జిల్లాలో ఒక్క పర్యాటక హోటల్ నిర్మించిన దాఖలాలు లేవు. మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో జిల్లాలో 'హరిత'పేరిట ఏడు పర్యాటక హోటళ్లను నిర్మించి పర్యాటకం అన్న పదానికి ఎనలేని గ్లామర్, ప్రాధాన్యత కల్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కడప నగరంలోని ప్రధాన హరిత హోటల్‌ను మరమ్మతుల పేరుతో ఆర్నెళ్లుగా పలు గదులను వసతికి దూరం చేయడం గమనార్హం. ప్రతి పథకానికి ప్రణాళిక దశలోనే కనీసం మూడు మాసాలు గడువు పెడుతుండడం ఆర్థికంగా ఎలాంటి విడుదల లేకపోవడంతోనే ఇంత కాలయాపన జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

గత పథకాల మాటేమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలపై జిల్లా పర్యాటకాభిమానుల్లో నమ్మకం సన్నగిల్లింది. ఇంతకుముందు అధికారం (2014–19)లో ఉన్నప్పుడు గండికోటను అభివృద్ధి చేస్తామని ఇలాంటి వాగ్దానాలే చేశారు. రోప్‌వే ఏర్పాటు చేస్తామని చెప్పడంతోపాటు కొద్దిగా సామాగ్రిని కూడా తెప్పించి హడావుడి చేశారు. ఆ తర్వాత ఆయనగానీ, సంబంధిత అధికారులుగానీ దాని గురించి పట్టించుకోలేదు. ఎప్పటికప్పుడు చూస్తాం...చేస్తాం అంటూ కాలాన్ని నెట్టుకొస్తున్నారేగానీ చేసిన వాగ్దానం మాత్రం కార్యరూపంలోకి రాలేదు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలను ట్రెక్కింగ్ అభివృద్ధి ఎంపిక చేసినట్లు చెబుతున్నా గండికోటలో అంతకుముందే నిర్మించిన అడ్వెంచర్స్ అకాడమి అభివృద్ధిపై కూడా ఏమాత్రం దృష్టి సారించలేదు. దీంతో ఇన్‌స్టిట్యూట్ కార్యాచరణ లేక వెలవెలబోతోంది.

టెంట్ సిటీగా...?

గండికోటకు వస్తున్న పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఉన్న పర్యాటకశాఖ హోటల్ గదులు చాలక అన్ సీజన్‌లో 600–700 టెంట్లు వేస్తున్నారు. సీజన్‌లో వెయ్యికి పైగా డిమాండ్ ఉంది. కానీ ఆ మేరకు ఆదాయం మాత్రం కనిపించడం లేదు. పర్యవేక్షణ లోపమే దీనికి ప్రధాన కారణం.

గండికోట ఉత్సవాలేవీ?

ఇంతకుముందు వరుసగా గండికోట వారసత్వ ఉత్సవాలు నిర్వహించడంతో దానికి ఎనలేని ప్రచారం లభించింది. దీని ప్రత్యేకతలు తెలుసుకున్న వారంతా దీన్ని గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా కొనియాడుతూ యునెస్కో గుర్తింపుకోసం ప్రయత్నించాలని సూచిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇలాంటి ప్రయత్నాలేవీ చేయకపోవడం వారి చిత్తశుద్ధి లోపానికి నిదర్శమని ఈ ప్రాంత పర్యాటకాభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో బెల్లంమండి ప్రాంతంలోని చిన్నమునిరావు వీధిలో నివాసముంటున్న పఠాన్ జమీలను భర్త ఇమ్రాన్ సుత్తితో తలపై దాడి చేసి దారుణంగా హతమార్చాడు. రెండు రోజుల కిందట జరిగిన ఈ సంఘటనలో నిందితుడు ఇమ్రాన్‌ఖాన్‌ను గౌస్‌నగర్‌లో సీఐ నాగార్జున, ఎస్ఐ ఎస్‌కేఎం హుసేన్ తమ సిబ్బందితో కలిసి శనివారం అరెస్టు చేశారు. అతన్ని కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా రిమాండుకు తరలించారు. హతుడి వద్దనుంచి హత్యకు ఉపయోగించిన సుత్తిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలియజేశారు.

యువకుడిపై కత్తితో దాడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని ఎర్రముక్కపల్లి సమీపంలో చికెన్ అంగడి యజమాని అస్లాం వద్ద ఇర్ఫాన్, ఖలీల్ పని చేస్తున్నారు. ఖలీల్ ఇర్ఫాన్‌పై చాడీలు చెప్పడంతో అస్లాం ఇర్ఫాన్‌ను పనిలో నుంచి తీసేశాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఇర్ఫాన్ ఖలీల్‌పై కత్తితో శనివారం దాడి చేశాడు. గాయపడిన ఖలీల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఖలీల్ ఫిర్యాదు మేరకు ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో పురుగు మందుతాగి ఆత్మహత్య

ఖాజీపేట : అప్పుల బాధ తాళలేక మానసిక ఒత్తిడికిలోనై పురుగు మందు తాగి ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖాజీపేట మండలం బుడ్డాయపల్లె గ్రామానికి చెందిన రాజశేఖర్ (39) ఇంటి నిర్మాణం కోసం, అలాగే కుటుంబంలో జరిగిన వేడుక కోసం అప్పులు చేశాడు. సుమారు రూ. 4లక్షల మేరకు అప్పులు అయ్యాయి. వాటిని తీర్చే విషయంలో కుటుంబంలో వచ్చిన చిన్నచిన్న మనస్పర్థల కారణంగా మానసిక ఒత్తిడికి లోనై పురుగు మందు తాగాడు. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళితే అప్పటికే అతడు మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్టెమి ప్రాజెక్టుతో గుండెకు భరోసా

- గుండె జబ్బు మరణాలను తగ్గించడమే లక్ష్యం
- 2023లో ప్రారంభించిన వైఎస్ జగన్ ప్రభుత్వం
- అత్యవసర ప్రాథమిక చికిత్సతో తగ్గిన గుండె పోటు మరణాలు



ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి



స్టెమిపై జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు(ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : హార్ట్ ఎటాక్ కేసుల్లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ఏ మాత్రం ఆలస్యం చేసినా పేషెంట్ ప్రాణాలకే ప్రమాదమని కార్డియాలజిస్టు హెచ్చరిస్తున్నారు. స్ట్రోక్ వచ్చిన వారిలో 50 శాతం హాస్పిటల్‌కు చేరకముందే చనిపోతున్నారు. తీవ్రమైన కేసుల్లో హాస్పిటల్‌కు వచ్చాక కూడా 90 శాతం మంది మరణించే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఛాతిలో నొప్పి వచ్చాక గంటలోగా హాస్పిటల్‌కు చేరితే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. ఆలస్యమైతే గుండె కండరాలకు శాశ్వత నష్టం ఏర్పడుతుంది. గతంలో గుండె సంబంధిత వ్యాధులు, గుండె పోటుకు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర ప్రాథమిక చికిత్స దొరికేది కాదు. జిల్లా కేంద్రాల్లోని బోధనా ఆస్పత్రులు, సూపర్‌స్పెషాలిటీ కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఒక వేళ స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే పరీక్షలు, మందుల ఖర్చులు పక్కన పెడితే ఒక్క ఇంజెక్షన్‌కే రూ. 45-50 వేలు వెచ్చించాల్సి వచ్చేది. ఈ మొత్తాన్ని భరించడం పేదలు, మధ్య తరగతి వారికి మిక్కిలి భారంగా మారేది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె జబ్బులకు అత్యవసర ప్రాథమిక వైద్యం లేక, ఖర్చుల భయంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక గుండె జబ్బు వచ్చిన పేదలు, మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో గుండెకు భరోసా

ఏపీలో గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023లో 'స్టెమి ప్రాజెక్ట్'కు శ్రీకారం చుట్టింది. గుండె పోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటి గంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను నిలబెట్టే కార్యక్రమమే ఈ స్టెమీ ప్రాజెక్ట్. గుండె పోటు వచ్చిన తొలి గంటలోపే అంటే గోల్డెన్ అవర్‌లోపే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలను నిలబెట్టేందుకు అవకాశం ఉంది. గుండె పోటుకు గురై మరణించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కార్డియాలజీ, కార్డియోవాస్క్యులర్ సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయాలని భావించిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలు, పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో హృద్రోగ చికిత్స అందుబాటులోకి తెచ్చింది. గుండె పోటు వచ్చిన 40 నిమిషాల సమయంలో రోగికి అవసరమైన చికిత్సను అందించి ప్రాణాపాయం నుంచి కాపాడటమే 'స్టెమీ ప్రాజెక్ట్' ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం ప్రభుత్వ ఆస్పత్రుల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. అంతేగాక గోల్డెన్ అవర్‌లో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన గుండె జబ్బు బాధితుడికి రూ. 45 వేల ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు సమీపంలోని హబ్ సెంటర్లకు తరలించి గుండెపోటుకు చికిత్స అందించేలా నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గుండె పోటు వచ్చిన వారికి సకాలంలో అత్యవసర ప్రాథమిక వైద్యం అందడంతో చాలా మంది ప్రాణాలతో బయటపడ్డారు.

జిల్లా ఆస్పత్రిలో 36 మందికి టెనెక్టప్లస్ ఇంజెక్షన్లు

స్టెమి ప్రాజెక్ట్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో 36 మందికి రూ. 45 వేలు విలువ చేసే టెనెక్టప్లస్ ఇంజెక్షన్లను ఉచితంగా వేశారు. ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాలకు చెందిన వీరంతా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన వారే. వీరిలో ఇద్దరు మృతి చెందారని, మిగిలిన 34 మంది ప్రాణాపాయం నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉన్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో ఎప్పటికీ 6 ఇంజెక్షన్లు అందుబాటులో ఉంటాయని, ఏ సమయంలో ఆస్పత్రికి వచ్చినా అత్యవసర ప్రాథమిక చికిత్స అందిస్తామని తెలిపారు. టెనెక్టప్లస్ ఇంజెక్షన్లు పూర్తిగా ఉచితమన్నారు. అత్యవసర విభాగంలో వైద్యుడితో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఇదే ఇంజెక్షన్ ప్రైవేట్ ఆస్పత్రిలో వేస్తే రూ. 45 వేలు తీసుకుంటారని తెలిపారు. ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పవడం తదితర గుండె పోటు లక్షణాలని పేర్కొన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే 108 అంబులెన్స్ లేదా ఇతర మార్గాల ద్వారా గంటలోపు జిల్లా ఆస్పత్రికి రావాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన వెంటనే ఈసీజీ తీస్తారు. రిపోర్టులో గుండె పోటు అని నిర్ధారణ అయితే వెంటనే టెనెక్టప్లస్ ఇంజెక్షన్ వేస్తారు. తర్వాత 4-5 గంటల్లోగా బాధితుడిని కడపకు తీసుకెళ్తే అక్కడి రిమ్స్ లేదా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గుండె పోటుకు సంబంధించి ఉచితంగా చికిత్స అందిస్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్టెమి ప్రాజెక్ట్ పథకం పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎంతో మంది ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు.

మొదటి గంటలోపు ఆస్పత్రికి రావాలి



గుండె పోటు వస్తే జిల్లా ఆస్పత్రికి వెంటనే రావాలి. ఆలస్యం చేయకుండా మొదటి గంటలోపు ఆస్పత్రికి చేరుకోవాలి. జిల్లా ఆస్పత్రిలో గుండె పోటుకు అత్యవసర ప్రాథమిక చికిత్స ఇస్తారనే విషయం చాలా మందికి తెలియదు. గుండె పోటు నుంచి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం ఖరీదైన రూ.45 వేలు విలువ చేసే టెనెక్ట్ ప్లస్ ఉచితంగా అందిస్తోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

మైలవరం : మండల పరిధిలోని తొర్రివేముల గ్రామంలో రైతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మప్ప (36)అనే వ్యక్తికి ఏడు ఎకరాల పొలం ఉండగా తొర్రి వేముల గ్రామ సమీపంలో ఉన్న నొస్సం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న పంట పొలంలో మిరప పంటను సాగు చేసుకుంటున్నాడు. చాలా మంది రైతులు బ్రాంచ్ కెనాల్‌లో నుంచి నీటిని మళ్లింపుకోసం ప్రత్యేక మోటర్లను ఏర్పాటు చేసుకున్నారు. మృతుడు తిమ్మప్పకు కూడా మోటారు ఉండటంతో ఉదయం పంటకు నీరు అందించాలని పొలానికి వెళ్లాడు. అయితే స్టార్టర్ల జాయింట్ అయి ఉండటం వల్ల మోటారు వేయబోతు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడని ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలతోపాటు భార్య ఉన్నారు. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, అధికార ప్రతినిధి కొమెర్ల మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు ఆవుల వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఫోన్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ప్రకటించారు.

నాలుగు బైక్‌లు స్వాధీనం

పోరుమామిళ్ల : జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీ చేసిన నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల పట్టణంలో బైకు చోరీకి గురైందని స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం సీతారామపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా దొంగిలించిన బైకును గుర్తించామన్నారు. దొంగిలించిన బైక్‌పై వెళుతున్న లూజరయ్య, రవీంద్రలను విచారించగా చోరీలను ఒప్పుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని కడప రిమ్స్, కడప టౌన్, ప్రొద్దుటూరు, పోరుమామిళ్ళ పట్టణంలో దొంగిలించిన నాలుగు బైక్‌లను బొప్పాపురం గ్రామానికి సమీపంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చీనితోటకు నిప్పు : రూ. 3 లక్షలు నష్టం

తొండూరు : మండల కేంద్రమైన తొండూరులో ఓ చీని తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తోట దగ్ధమైంది. శనివారం తొండూరుకు చెందిన గుత్తి రాము, ముని రెడ్డి చెందిన చీని తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్రమాదంలో చీని చెట్లు, టెంకాయ చెట్లు, డ్రిప్పు వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు కంది పంట కూడా కాలి బూడిదైనట్లు బాధితులు తెలిపారు. దాదాపు మూడు లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.

సజ్జల రామక్రిష్ణారెడ్డిని కలిసిన జిల్లా నేతలు



సజ్జల రామక్రిష్ణారెడ్డితో సురేష్ బాబు, అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామక్రిష్ణారెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన్ను మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు కలిసి జిల్లా రాజకీయాల గురించి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, కిరణ్, దాసరి శివప్రసాద్, తోటక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓకు అందిస్తున్న సర్క్యులేషన్ సిబ్బంది

ఖాజీపేట : ఖాజీపేట మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు శనివారం సాక్షి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. మండలంలో బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, కస్తూర్బా, రంగాపురం ఉన్నత పాఠశాల, కొత్తపేట ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్లోని 10వ తరగతి చదువుతున్న 352 మంది విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను పాఠశాలల హెచ్‌ఎంల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల : గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పోలీసుస్టేషన్ ఆవరణలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో అక్రమంగా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే తమ సిబ్బందితో కలిసి చిదానందనగర్‌లోని కనుములపూటి రమణయ్య వద్ద నుండి 1081 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలి

ప్రమాద రహిత డ్రైవర్లకు ఘన సన్మానం



సత్కారం పొందిన డ్రైవర్లతో జడ్జి, ఎస్పీ, ఆర్టీసీ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏకాగ్రతతో విధులు నిర్వర్తించి ప్రమాద రహిత ఆర్టీసీ డ్రైవర్లుగా నిలవాలని పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్, జడ్జి స్వర్ణప్రసాద్ పిలుపునిచ్చారు. 36వ రోడ్డు భద్రతామాసోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ప్రమాదరహిత డ్రైవర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఏకాగ్రత కోల్పోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. గ్యారేజీలో నుంచి బస్సును తీసుకునేటపుడు కండీషన్‌లో ఉందో, లేదో సరిచూసుకోవాలన్నారు. ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ మాట్లాడుతూ డ్రైవర్లు ప్రశాంతమైన మనస్సుతో బస్సును నడపాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రతినిత్యం జాగరూకతతో వ్యవహరించాలన్నారు. రవాణా శాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రమాదాలు చేయని డ్రైవర్లు ఉండడం స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు రోడ్డు ప్రమాద రహిత సంస్థగా పేరొందని, ఆ పేరును నిలబెట్టేందుకు ప్రతి డ్రైవరు కృషి చేయాలన్నారు. డ్రైవర్ల కారణంగా సంస్థకు మంచి పేరు వస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లకు సత్కారం:

కడప జోన్ పరిధిలో ప్రమాద రహిత డ్రైవర్లుగా నిలిచిన వి.ప్రసాద్ (ప్రొద్దుటూరు డిపో), ఎం.ప్రసాద్ (తాడిపత్రి), ఈ.నాగరాజు (శ్రీ సత్యసాయి), జీకే మోహిద్దీన్ (అనంతపురం), ఎస్‌ఏ షరీఫ్ (కడప), ఎంసీఓ రెడ్డి (ప్రొద్దుటూరు), బీజీ స్వామి (పులివెందుల), బి.వెంకటయ్య, బీజే నాయక్, వీఎస్ రాయుడు (కడప), ఎస్ఎం బాష, ఎల్‌ఏఎస్ రెడ్డి, జీఆర్ఎస్ రెడ్డి (పులివెందుల), బీవీబీ రెడ్డి, ఎస్‌జీ బాష, ఎస్‌కే బాష (బద్వేలు), ఎం.మనోహర్, ఎంఆర్ శంకర్, ఎంజే బిజయ్య (జమ్మలమడుగు), ఎల్ఎస్‌రెడ్డి, ఆర్‌ఏ సత్తార్, డి.హుసేన్ (మైదుకూరు), ఎంఎస్‌కుమార్, ఏఎస్ రాయుడు, ఎం.అయ్యవారప్ప(ప్రొద్దుటూరు)లను సత్కరించారు. కార్యక్రమంలో కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, పీఓ ధనలక్ష్మి, సూపరింటెండెంట్ రవి, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీలత, మంజుల, కన్యాకుమారిలతో పాటు యూనియన్ నాయకులు ఏఆర్ మూర్తి, పురుషోత్తం, సగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మీ కోపాన్ని ప్రజలపై చూపించొద్దు

- సురక్షిత నీరు లేక ప్రజలు 3 కి.మీ వెళ్లాల్సి వస్తోంది
- వాటర్ ప్లాంట్‌కు కరెంటు బిల్లులు చెల్లించలేదనడం శుద్ధ అబద్ధం
- సేవాభావంతో నడిపే మరొకరికైనా ప్లాంటు అప్పగించండి
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆర్. మాధవికి ఏదైనా కోపం, కక్ష ఉంటే తనపై చూపించాలని, ప్రజలపై చూపవద్దని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య కోరారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను వాటర్‌ప్లాంటుకు కరెంటు బిల్లులు చెల్లించలేదని, స్కూల్ హెడ్‌మాస్టర్, స్థానిక ప్రజలు అభ్యంతరం చెబుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవాలన్నారు. కట్టీల బడిలో మూడు గదులు ఉండగా, అక్కడ 13 మంది పిల్లలు మాత్రమే ఉన్నందున ఒక గదిని మాత్రమే పాఠశాలకు వినియోగిస్తున్నారని, మిగిలిన రెండు గదులను సున్నం, బ్లీచింగ్ పౌడర్ నిల్వ చేసేందుకు వినియోగించేవారన్నారు. 2019లో ఇదే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు డీఆర్‌ఏ యూత్ ఆర్గనైజేషన్ చేసిన సామాజిక సేవలను గుర్తించి వాటర్‌ప్లాంటు పెట్టేందుకు డీఈఓ కమిటీ వేసి అనుమతించారన్నారు. హెడ్‌మాస్టర్ అప్పుడు అభ్యంతరం లేదని లెటర్ ఇచ్చారని, టీడీపీ వారు బెదిరించినా సరే...ఇప్పుడు కూడా అభ్యంతరం లేదని లెటర్ ఇచ్చారన్నారు. అందులో తాము మినరల్ ఫండ్స్‌తో బోరు వేసి, మిగిలిన సామగ్రికి తమ సొంత నిధులు వెచ్చించి వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. అప్పటి నుంచి స్కూల్ పిల్లలకు ఉచితంగా నీరు అందివ్వడమేగాక, స్థానిక ప్రజలకు తక్కువ ధరకే స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామన్నారు. తమ ప్లాంటుపై 20 మంది యువకులు ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రతినెలా తామే కరెంటు బిల్లులు చెల్లిస్తున్నామని అందుకు సంబంధించిన రశీదులు చూపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటు అని పేరు పెట్టి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తుంటే...ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్లాంటు మూసివేయించడం అన్యాయమన్నారు. కడపలో తాగునీటి సమస్య ఉందని అసెంబ్లీతోపాటు, పలు వేదికలపై చెప్పిన ఎమ్మెల్యే..తాము ప్రతిరోజూ ప్రజలకు వేల గ్యాలన్ల స్వచ్ఛమైన నీటిని అందిస్తుంటే...వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందని ఓర్వలేకపోయారన్నారు. ప్లాంటు మూసివేయడం వల్ల స్థానిక ప్రజలు 3 కి.మీ వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. తనకు కాకపోయినా సేవా భావంతో పనిచేసే మరొకరికైనా ప్లాంటు అప్పగించాలని కోరారు. వందలాది మంది యువతకు శిక్షణను ఇచ్చే న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌ను కూల్చివేసి, అందులో ఉన్న తుక్కును ఏ టెండర్ లేకుండా అమ్ముకున్నారని...కోట్లు విలువజేసే రెండకరాల స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి తీసుకోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. ప్లాంటు మూసివేతపై స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మియ్యా పాల్గొన్నారు.

భాషా సంస్కృతికి వన్నెతెచ్చిన భూతపురి

- నేడు 88వ జయంతి
- బ్రౌన్‌లో 23వ సాహిత్య పురస్కార ప్రదానం



డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ (ఫైల్)

కడప కల్చరల్ : జిల్లాకు వన్నె తెచ్చిన మహాకవులలో డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ప్రముఖంగా నిలుస్తారు. అవధానిగా భాషాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా జ్యోతిష్య, వాస్తు శాస్త్రాల నిపుణునిగా, సంస్కృతాంధ్రంలో మహాకవిగా పేరుగాంచారు. ఆయన 88వ జయంతి సందర్భంగా ఆదివారం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ఆయన పేరిట ఏర్పాటు చేస్తున్న స్మారక సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం

మన జిల్లాకు కవుల గడపగా పేరుంది. ప్రముఖులైన కవులెందరో జిల్లా పేరును ఇనుమడింపజేశారు. వారిలో నిన్నటితరం కవి సంస్కృతాంధ్ర సాహితీవేత్త, మహావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ముందు వరుసలో ఉంటారు. ఆయన రాసిన శ్రీకృష్ణభారతం తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం కల్పించింది.

ఆయన అనంతరం వారి కుమారులు ఆయన పేరిట స్మారక ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఓ పండితునికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నారు. అల్లసాని పెద్దన సాహితీ పీఠంతో కలిసి యేటా క్రమం తప్పకుండా ఈ విశిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆయన పేరిట 88వ జయంతి సందర్భంగా 23వ స్మారక అవార్డును స్థానిక ప్రముఖ సాహితీవేత్త పుత్తా పుల్లారెడ్డికి అందజేయనున్నారు.

బాల్యం నుంచే...

జిల్లాలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో ఓ పండితుడు పురాణ ప్రవచనం చేస్తున్నారు. ఓ రోజు ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. కానీ పక్కనే ఉన్న 13 సంవత్సరాల ఆయన కుమారుడు తండ్రి స్థానంలో పురాణ ప్రవచనం మొదలు పెట్టాడు. మిగతా 13 రోజులపాటు ఆ బాలుడే పురాణ ప్రవచనం చేశాడు. ఆ బాలుడు భూతపురి సుబ్రమణ్యశర్మ.

కవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 1938 ఫిబ్రవరి 14న వల్లూరు సమీపంలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్బయ్యశర్మ మహాపండితులు ఆయన నుంచి కుమారుడు సుబ్రమణ్యశర్మకు సాహిత్య వారసత్వం లభించింది. తండ్రి వద్దే సంస్కృతాంధ్రలను అవపోసాన పట్టారు. ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూలులో చదివారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 4వ యేటనే ఛందోబద్ధంగా కవిత్వం చెప్పడం మొదలు పెట్టారు. తండ్రి సుబ్బయ్యతోనే కవితా రచనలు పోటీపడి ఒప్పించేవారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వద్ద ఆశువుగా పద్యాలు, సంస్కృత శ్లోకాలు చెప్పి ఆశీస్సులు, ప్రశంసలు పొందారు. స్వామి జయేంద్ర సరస్వతి కూడా భూతపురి సాహిత్య పతిమకు ముగ్దుడై ఆశీర్వదించి తన సభల్లో ప్రసంగానికి అవకాశం ఇచ్చారు.

బహుముఖ ప్రజ్ఞ :

డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిగా, అవధానిగా, జ్యోతిష శాస్త్రం, వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్రేయేతర ప్రాంతాలలో కూడా పేరు పొందారు. 49 సంవత్సరాలపాటు కవితా సరస్వతిని ఆరాధించారు. ఆయన శ్రీరామభక్తుడు. తన రచనలన్నీ శ్రీరామునికే అంకితమిచ్చారు. 1989లో డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల సమక్షంలో సువర్ణ గండపేండేర సత్కారం జరిగింది. 1997లో కడప నగరంలో ఆయన గజారోహణం చేశారు. స్వర్ణ హస్త కంకణ సత్కారం స్వీకరించారు. ఉభయ కవి సార్వభౌమ బిరుదు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, పలు సాహితీ సంస్థల నుంచి ఎన్నో బిరుదులు పొందారు. ఆయన పేరిట కుమారుడు డాక్టర్ శివరామ సురేంద్ర శర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రిలు స్మారక సంస్థను ఏర్పాటు చేసి యేటా ఆయన జయంతి నాడు సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు.